అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

విశాలాంధ్ర - సాలూరు: మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారని ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్నమయ్య జిల్లాలో నిరసన తెలియజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులను అక్రమ అరెస్ట్ చేయడం అన్యాయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. మంగళవారం సాలూరులో విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక మరొకలా వ్యవహరిస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తుందన్నారు. ఈ విధానం సరికాదని, అధికారం శాశ్వతం కాదన్న సత్యాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించాలన్నారు. తప్పుడు కేసులు పెడుతూ వేదిస్తే రానున్న రోజులలో కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. సత్యసాయి జిల్లాలో అక్రమ అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరి, మని, సాయి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయండి

మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీవన్న

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పోరాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు యువత కదలి రావాలని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట జీవన్న పిలుపునిచ్చారు. పట్టణంలో స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈ ఏడాది జాబు క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాబు గెలిస్తే జాబ్ గ్యారంటీ అని కోటి ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని యువత అందరూ గెలిపిస్తే కూటమి పాలనతో నిరుద్యోగులకు, ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో నూతన పరిశ్రమలు రావాలన్నా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రత్యేక హోదా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని అన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగులు కల్పిస్తామన్న నరేంద్ర మోడీ ఈ 11 ఏళ్లలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారో దేశ ప్రజలందరికి సమాధానం చెప్పాలని అన్నారు. ఈ డిమాండ్ల సాధనకు యువత అంతా కదలి పోరాడాలని అన్నారు. అందులో భాగంగానే హలో యువత చలో శ్రీకాకుళం అని పిలుపునివ్వడం జరిగిందని, ఫిబ్రవరి 6న జరిగే బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా యువత అంతా కదలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

విశాలాంధ్ర సంచార పుస్తకాలయం ప్రారంభం



విశాలాంధ్ర - పార్వతీపురం /టౌన్/బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో స్థానిక రైతు బజార్ కూడలి సమీపంలో విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని జిల్లా కేంద్రానికి చెందిన సాహితీవేత్తలు, బార్ అసోసియేషన్ నేతలు, ఎన్జీవో యూనియన్ నాయకులు, ఏఐటీయుసి నాయకులు, ఎపియుడబ్ల్యూజె నాయకులు, విశాలాంధ్ర విలేకరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాలాంధ్ర బుక్ హౌస్‌కు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. పుస్తక పఠనం యువత అలవాటు చేసుకోవాలని పుస్తక పఠనం ద్వారా ప్రపంచాన్ని తెలుసుకోవచ్చని తెలియజేశారు. ముఖ్యంగా నేటి యువత పుస్తకాలకి దూరమై సోషల్ మీడియాకు దగ్గర అయ్యారని, సోషల్ మీడియా విజ్ఞానం కంటే యువతని అజ్ఞానం వైపు నడిపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి విశాలాంధ్ర పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు డా. మంచిపల్లి శ్రీరాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, ప్రముఖ కవి, సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు, జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షులు జీవిఆర్ఎస్ కిషోర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, ఎపియుడబ్ల్యూజె జిల్లా కార్యదర్శి గంగి శ్రీనివాసరావు, విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిని రమేష్, పట్టణ విలేకరి వానపల్లి శంకరరావు, విశాలాంధ్ర సంచార గ్రంథాలయం ఇన్‌చార్జ్ వేణు, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గిరిజన విద్యార్థికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - సీతంపేట: మండలం పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యగ్నిక్ అనే ఆరేళ్ల గిరిజన విద్యార్థి అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యగ్నిక్ ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ క్రీడాకారుడిని మంగళవారం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల క్రీడాకారులతో పోటీపడి గోల్డ్ మెడల్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - మక్కువ: గ్రామాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. మక్కువ పీహెచ్‌సీలో ఆశాడే, శంబర జాతర వైద్య శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. మెరుగైన ఆరోగ్యం, రక్తహీనత నివారణకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలని, తగు సూక్ష్మ పోషకాలు అవసరమని పేర్కొన్నారు. ఐరన్ లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రం అందజేస్తున్న టిహెచ్ఆర్ గర్భిణీ, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 10 నుండి నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి తగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, డా.ఎస్.కిరణ్ కుమార్, డా. నిఖిల, ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, సిహెచ్ఓ నిర్మల, సూపర్వైజర్స్ రత్నం, జయగౌడ్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

'పది' విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించాలని బలిజిపేట మండల విద్యా శాఖ అధికారి 1 సామల సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన చిలకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఎఫ్ఏ 3 పరీక్షలను విద్యార్థులు ఏ విధంగా రాసినది అడిగి తెలుసుకున్నారు. ఏ సబ్జెక్టులోనైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాలలో తరగతులకు హాజరు అయినప్పుడు మధ్యాహ్న భోజనం ఉంటుందని తెలిపారు. ఎఫ్ఏ 3 పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి తగిన విధంగా తర్ఫీదునివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమణపై విచారణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడులో బీసీకాలనీలో గల సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌కు చెందిన 20 సెంట్ల భూమిని ఆక్రమణ చేసిన సంఘటనపై తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రమణ్యం, సర్వేయర్ రాజులు మంగళవారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. ఈ స్థలం గ్రామపంచాయతీ కార్యాలయానికి కేటాయించినందున వెంటనే ఆక్రమణ తొలగించాలని ఆదేశించారు. చెరువులు ఆక్రమణ గురించి, ఎలాంటి పట్టాలు లేకుండా చేసిన నిర్మాణాలు చేస్తే తగు చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

19 నుండి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

విశాలాంధ్ర - బెలగాం: ఈనెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించాల్సిన డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్ఎ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్‌లో టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పరీక్షలు, హ్యాండ్లూమ్ వీవింగ్ ప్రాక్టికల్ పరీక్షలు 19వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించబడుతుందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యా శాఖాధికారి డా. ఎస్.తిరుపతి నాయుడు తెలిపారు. టిసిసి ఫిబ్రవరి 2025 పరీక్షల టేబుల్ www.bse.ap.gov.in. కార్యాలయపు వెబ్సైట్లో అందుబాటులో ఉందని తెలిపారు.

ప్రమాదాలలో కాపాడిన వారికి ప్రోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర - పాలకొండ: రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరైతే తక్షణమే స్పందించి క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించే క్రమంలో అట్టివారికి ఐదు వేల రూపాయలను ప్రోత్సాహక బహుమతిగా ఇవ్వడం జరుగుతుందని స్థానిక ఇంధన శకటాల అధికారి వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో, ఏరియా ఆసుపత్రిలో వైద్యులు జి.నాగభూషణరావు, డిపో మేనేజర్ పి.వెంకటరమణతో కలసి, అలాగే పోలీస్ శాఖ అధికారులతోనూ, డ్రైవర్లకు ఆర్టీసీ కార్మికులకు అవగాహన కల్పించారు.

దానికి సంబంధించినటువంటి ప్రభుత్వం విడుదల చేసిన బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టైర్లు ఎడిసి భాసూరు కృష్ణమూర్తి, సెక్యూరిటీ హెడ్గార్డ్ రాంబాబు, జనరల్ ఎడిసి జగన్నాథం, స్టోర్ ఎడిసి రాజు, డ్రైవర్ ఇన్స్పెక్టర్ నాగరాజు, మెకానికల్ శ్రీను, ఏపీఎస్ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు ప్రతిపాదనలు

లక్ష్యాలను సాధించకుండా కథలు చెప్పొద్దు
కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

విశాలాంధ్ర - అరకులోయ: లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు నీడతోటలు పెంపకానికి ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. రానున్న ఐదేళ్లో లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని స్పష్టం చేసారు. ప్రతీ సంవత్సరం 20 వేల ఎకరాల్లో కాఫీని విస్తరించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేంచిన పనులు పూర్తి చేయకుండా కథలు చెప్పొద్దని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు, వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, పౌర సరఫరాలు, సెరీకల్చర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటపాక,పాడే, కొయ్యూరు, రాజవొమ్మంగి, గంగవరం, కొయ్యూరు, అడ్డతీగల, వి.ఆర్.పురం మండలల్లో ఫారం పాండ్స్ లక్ష్యాలు అధిగమించాలన్నారు. రబీ సీజన్ ఇ క్రాప్ బుకింగ్ చేయాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన విభాగంలో 98 శాతం ఈ క్రాప్ బుకింగ్ చేసారని అన్నారు. క్రాప్ బుకింగ్ చేసిన మేరకు అథెం టికేషన్ పూర్తి చేయాలని చెప్పారు. వరి, రాజ్మా పంటలకు ఈకేవైసీ వేయించాలని సూచించారు. పి. ఎం.కిసాన్ వెరిఫికేషన్ పక్కాగా చేయాలని ఆదేశించారు. రెండు వారాల్లో ఇ కేవైసీ, ఇ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. కూనవరం, చింతూరు మండలాల్లో ఉద్యానవన నర్సరీలు పెంపకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ముంచంగిపుట్టు మండలంలో కేజ్ కల్చర్ రెన్యువేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో- కాన్ఫరెన్సులో రంపచోడవరం పి.ఓ కె.సింహాచలం వర్చువల్‌గాను, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

పల్లె పల్లెకు పోదాం - ప్రజా సమస్యలు చూద్దాం

సీపీఐ పాడేరు మండల కార్యదర్శి అమర్

విశాలాంధ్ర - పాడేరు: పల్లె పల్లెకు పోదాం - ప్రజా సమస్యలు చూద్దామని, నాణ్యత లోపమైన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టుల లైసెన్స్ రద్దు చేయిద్దామని అల్లూరి జిల్లా పాడేరు మండల సీపీఐ కార్యదర్శి అమర్ అన్నారు. సీపీఐ పాడేరు మండల సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి మాట్లాడారు. బి.టి రోడ్లు, భవనాలు, స్కూల్ బిల్డింగులు, వాటర్ ట్యాంక్లు, సిసి రోడ్లు నిర్మాణాలు పూర్తి చేసిన నుండి మెయింటెనెన్స్ కాలం పూర్తి కాకముందే నిర్మాణాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఈ విషయంపై గతంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పంచాయతీ డీఈ నరేన్ కుమార్ స్పందించలేదన్నారు. పాడేరు మండలం అల్లివరం రోడ్డు కూడా వేసిన కొద్ది కాలానికే పాడైపోయి ఉదన్నారు. నాణ్యత లోపాలు పరిశీలనపై కమిటీ ఏర్పాటు చేసి జిల్లాలో జరిగిన నిర్మాణాలపై పర్యవేక్షణ చేసి రిపోర్ట్ కలెక్టర్‌కు అందజేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు జల్లి రాజబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ముప్పలి లక్ష్మణ్, ప్రజలు దిలీప్, రామారావు, కొండమ్మ, కాంతమ్మ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ రూపకల్పన అద్భుతం

ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలం పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి: కేంద్ర, రాష్ట్రాలలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, సీపీఐ పార్టీకి ఏనాడూ అధికారం దక్కక పోయినా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడే ప్రజా పత్రిక "విశాలాంధ్ర" అని ఆదివాసీ ట్రస్ట్ చైర్మన్ కే.బాలం పడాల్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆ ట్రస్ట్ సభ్యులతో కలిసి విశాలాంధ్ర 2025 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. క్యాలెండర్‌ను అద్భుతంగా రూప కల్పన చేసి ప్రజలకు అందించడం అద్భుతం అన్నారు. పత్రికగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కథనాలు ప్రచురిస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మధ్య వారధిగా ఉన్న ఈ పత్రిక దినదిన ప్రవర్తమానమై మరింతగా ప్రజల మన్ననలు చూరగొనాలన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: బాల్య వివాహాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలికల సంక్షేమం, రక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బాల్య వివాహాలు సామాజిక సమస్యగా గుర్తించి బాల్యవివాహాల నివారణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో నూరు శాతం సమావేశాలు నిర్వహించాలని అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. మండల స్థాయిలో సర్పంచులకు, వార్డు మెంబర్లకు ఎంపీడీఓలు వర్క్‌షాపు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలపై 430 గ్రామాలలో అవగాహనా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాలు రహిత గ్రామంగా ప్రకటించిన గ్రామాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. గత సంవత్సరం పది పాసైన విద్యార్దులు ఎంత మంది ఇంటర్మీడియట్లో చేరారని ఆరా తీసారు. పది ఫెయిలైన విద్యార్థులను గుర్తించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని రేఖపల్లి పీ.హెచ్.సిలో క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన ర్యాలీని మంగళవారం వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవ గాహన పెంపొందించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించబడింది. ప్రాథమిక ఆరోగ్య వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ ప్రాముఖ్యతపై సందేశమిచ్చారు. "కాలం మించిన చికిత్స కంటే ముందస్తు జాగ్రత్త మెరుగైనది" అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని వైద్య పరీక్షలు, మానవశరీరంలో వచ్చే మార్పులను గమనించడం వంటి విషయాలపై ప్రజలకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సెర్వికల్ క్యాన్సర్ వంటి వ్యాధుల పైన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్తలు పి.హెచ్. యన్ భద్రకాళి, హెచ్.వి పున్నమ్మ, సి.హెచ్.వోలు పవన్, సురేష్, పోచమ్మ, మంగ, అనుష, హెచ్.ఏ శ్రీనివాస్, రామారావు,సత్యనారాయణ, ఎ.యన్.యంలు, చంద్రమ్మ మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను నివారించవచ్చు

విశాలాంధ్ర - జీకే వీధి: పెదవలస ఆసుపత్రిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా ఆసుపత్రి నుండి సంత మార్కెట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: విశాఖపట్నం పెట్టుబడుల సదస్సులో శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరిం చుకోవాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం, పీసా కమిటీల ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంజంగి పాడు పిసా కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ వరకు గ్రామస్థాయిలో నిరసనలు తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, డిఎల్‌వో స్టేట్ అడ్వైజర్ ఎస్.మాణిక్యం, బీజేవైఎం పార్టీ జిల్లా ఇన్చార్జ్ కిలో రాజన్, లువ్వా సింగి ఎంపీటీసీ సన్యాసి దొర, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పి.సంకయ్య, వివిధ పంచాయతీల పిసా కమిటీ ఉపాధ్యక్షులు కార్యదర్శులు గోరువా చిరంజీవి నాయుడు, లక్ష్మణరావు, చంద్రమోహన్, మణికంఠ, చిట్టి నాయుడు, కృపారావు, పాంగి చిన్నారావు పాల్గొన్నారు.

జంతు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - అనంతగిరి: జంతు సంక్షేమం, సంరక్షణ, జంతు చట్టాలపై చిలకలగెడ్డ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కాశీపట్నం పశు వైద్యాధికారి సాగరి గణేశ్వరరావు అవగాహన కల్పించారు. జంతు క్రూరత్వ నిరోధక చట్టం 1960 ప్రకారం జంతువులను హింసించడం, కొట్టడం, బాధ, నొప్పిని కలిగించడం నేరమన్నారు. 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం వన్యప్రాణులను వేటాడడం, చంపడం, తోలు, మాంసం విక్రయించడం నేరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైమన్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, జూనియర్ వెటర్నరీ అధికారి సుధా వాణి తదితరులు పాల్గొన్నారు.

కుసుమ్మ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - జీకె వీధి: గూడెం కొత్త వీధి మండలం పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన లోత కుసుమ్మ గత 21 సంవత్సరాల నుండి సీనియర్ వంట ఆయాగా ఎంపీపీ స్కూల్లో నందు విధులు నిర్వహించారు. ఇటీవల వయసు సహకరించకపోవడంతో విధుల నుండి తప్పుకొని మరో వ్యక్తిని నియమించడం జరిగిందని మండల విద్యా శాఖ అధికారి తగ్గి సత్యనారాయణ అన్నారు. ఆయన మాట్లాడుతూ 21 సంవత్సరాలు ఎన్నో కష్టాలు బాధలు పడి బాధ్యతగా ఆమె విధులు నిర్వహించారన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో వేరొక వ్యక్తులకు వంట మనిషిగా ఇవ్వటం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తగ్గి సత్యనారాయణ, సిఆర్‌పి అంపురంగి ధరబాబు, ఎంఐసి ఉలం సత్యనారాయణ, లోత కన్న బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ట్రైకార్ డైరెక్టర్

విశాలాంధ్ర - కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎం.మాకవరం గ్రామానికి చెందిన గలివరీ నాగరాజు కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు పరామర్శించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వాటర్ ట్యాంక్ బోల్తా పడిన ఘటనలో మృత్యువాత పడిన నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సంపరి శివకుమార్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రీముల చంద్రరావు, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరిమెల రాజు, సీపీఐ నాయకులు ధన్యం రాజు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989138129, 7386603589

అదుపు తప్పితే అనంతలోకాలకే....

ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

విశాలాంధ్ర - చింతపల్లి: వాహనం అదుపు తప్పితే ప్రయాణం అనంత లోకాలకే అని తెలిసినప్పటికీ మన్య ప్రాంతంలో ప్రమాదమని తెలిసినా గిరిజనులు తప్పని ప్రయాణం చేయవలసి వస్తుంది. వాహనదారులు సైతం అతి విశ్వాసంతో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని మారుమూల పంచాయ తీలైన తమ్మంగుల, కుడుము సారి పంచాయతీల నడుమ ఉన్న గొర్రెల మెట్ట వద్ద వంతెన లేకపోవడంతో ఆ ప్రాంతీయులు అటు, ఇటు ఎత్తయిన ప్రాంతం నుంచి లోతైన ప్రాంతమైన ప్రమాద భరిత కాలువ గుండా ప్రయాణించ వలసిన పరిస్థితి. ఈ క్రమంలో వారపు సంతలకు వెళ్లి, వచ్చే ఈ ప్రాంతీయులు జీపులను ఆశ్రయిస్తున్నారు. ఆ జీపులలోనూ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణి కులను ఎక్కించుకుని వాహనాలను నడుపుతున్నారు. ప్రమాద భరితమైన ఆ ప్రాంతంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణి స్తున్న గిరిజనులున్న ఈ వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రయాణికుల ప్రాణాలన్నీ గాలిలో కలిసిపోయే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఈ వంతెన నిర్మాణం కోసం ఈ ప్రాంతీయులు పాలకులు, సంబ ంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం కనిపించలేదని, గత్యంతరం లేని ఈ ప్రాంతీ యులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల వారిని పడుతున్నారని తమ్మంగుల పంచాయతీ సర్పంచ్ సలిమితి

లక్ష్మయ్య, కుడుముసారి పంచాయతీ వార్డు సభ్యుడు బోండా సింహాచలం అన్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గొర్రెల మెట్ట వద్ద వంతెన నిర్మా ణానికి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రిన్సిపాల్ ఎల్.రాంప్రసాద్

విశాలాంధ్ర - పాడేరు: శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మీ పిల్లల్ని చేర్పించండి మంచి విజ్ఞానబుద్ధులతో మంచి విద్యను అందించి మంచి స్థాయిలో నిలబెడతామని శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కె.పంతులు బాబు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యూకేజీ నుండి ఏడవ తరగతి వరకు మంచి విద్యను అందించడం జరుగుతుందని ఏదైనా కాంపిటేషన్ పరీక్షకు వెళ్లినా మంచి మార్కు లు తెచ్చుకునే విధంగా విద్యను అందిస్తున్నామని వారన్నారు. అనతి కాలంలో అనేక ప్రాంతాల్లో మా పాఠశాల గురించి అనేకులు తెలుసుకొని సామూహిక అక్షరాభ్యాసానికి 55 మంది చిన్నారులను తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయిం చడం ఎంతో గౌరవకారంగా ఉందన్నారు. అలాగే సమూహిక అక్షరాభ్యాసానికి కూటమి పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే బాధ్యతలు నిర్వహిస్తున్న గిడ్డి ఈశ్వరి హాజరవడం చాలా సంతోషకరమని అన్నారు. పాఠశాలలో చేర్పిం చేందుకు గాను 9490303643, 850092 5494ను సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం...క్యాన్సర్‌ను తరిమేద్దాం..

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్‌ను వాడటం వల్లనే క్యాన్సర్ బారిన పడవలసి వస్తుందని ప్లాస్టిక్ నివారించి క్యాన్సర్ వ్యాధిని జయిద్దామని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ పార్వతీపురం, విజయనగరం అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో క్యాన్సర్ నివారణకై అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి పనికి ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడటం అలవాటుగా మారిపోయిందని దాని కారణంగానే మనం క్యాన్సర్ బారిన పడవలసి వస్తుందని అన్నారు. ప్రధానంగా ఆహార పదార్థాలకు కవర్లు ఉపయోగించడం వలన ప్లాస్టిక్ తగలబెట్టడం వలన కాలుష్య కారక వాయువులు వెలుపడతాయన్నారు. ప్రధానంగా క్యాన్సర్, గుండె జబ్బులు, జీర్ణాశయం, పేగు వ్యాధులు ఊపిరితిత్తులు, నరాల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తడానికి ప్రధాన కారణం క్యాన్సర్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన గొంతు, క్యాన్సర్ థైరాయిడ్, రొమ్ము, ఊపిరితిత్తులు, లివర్, గర్భాశయానికి సంబంధించిన క్యాన్సర్ వ్యాధులు రావడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కలిగి క్యాన్సర్ కారకాలైన ధూమపానం, మద్యపానం ప్లాస్టిక్ వాడకాలను అరికట్టి వారి ఆరోగ్యాన్ని క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం, కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, సహాయ కార్యదర్శి బివి నాయుడు, ట్రెజరర్ బి.తులసీదాస్, జిల్లాలోని పార్వతీపురం సీతానగరం గరుగుబిల్లి కొమరాడ జిఎంవలస మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. వివరాల్లోకి వెళితే కూనవరం మండలం, కొండాయి గూడెం గ్రామానికి చెందిన మాడకం సింగరమ్మ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. గత సెప్టంబరు-2024లో భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రిలో స్కానింగ్ తీయించుకున్నారు. స్కానింగ్ రిపోర్టులో (ఓవరియన్ సిస్ట్) 2.700 కేజీల గడ్డ ఉందని డాక్టర్స్ చెప్పారు. ఆపరేషన్ చెయ్యాలంటే 60-70 వేల రూపాయల ఖర్చు అవుతుందని చెప్పారు. అంత ఆర్థిక స్తోమత లేక అల్లాడుతున్న సమయంలో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ ఆపరేషన్ చేస్తారని చెప్పడంతో 28.01.25 చింతూరు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డిని సంప్రదించారు. ఈమేరకు మంగళవారం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ విజయ వంతంగా నిర్వహించి 2.700 కేజీల గడ్డను తొలగించారు. సింగారమ్మ కుటుంబ సభ్యులు డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ రమణారావులకు కృతజ్ఞతలు చెప్పారు.

సీఎస్పీ ద్వారా మెరుగైన బ్యాంకింగ్ సేవలు

విశాలాంధ్ర - గంగవరం: భారతీయ స్టేట్ బ్యాంక్ అనుబంధంగా పనిచేస్తున్న కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్పీ) ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని తహశీల్దారు సిహెచ్ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మంగళ వారం గంగవరంలో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బ్యాంకు పని దినాలతో, సమయాలతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజలకు బ్యాంకింగ్ సేవలు ఈ కేంద్రాల ద్వారా పొందవచ్చని ఆయన అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు కలిగించకుండా నిర్వాహకులు సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ రాచపల్లి రమేష్, ఖాతాదారుల సేవ కేంద్రం సిబ్బంది ఉషశ్రీ తదితరులు ఉన్నారు.

గిరిజనేతరుల ఆక్రమణలకు అడ్డుపడేదెప్పుడో..!

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల నుండి గిరిజనేతరులు భూములు కొనరాదని అమ్మకాలు చేయకూడదని నినాదం ఉన్నప్పటికీ కొంతమంది గిరిజనేతరులు గిరిజనులను బినామీలుగా తయారుచేసి వారికి కొంత మొత్తంలో డబ్బు ఆశ చూపి గిరిజన ప్రాంతం భూములను దోచుకుంటున్నారని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుకుంపేట మండల కేంద్రంలో ఆదివాసి మహిళ తమ భూమి ఆదివాసేతరులు అక్రమంగా దౌర్జన్యం చేసి ఇల్లు నిర్మించుకున్న వారి నుండి తన భూమి స్థలం నాకు అప్పజెప్పాలని, గత తొమ్మిది రోజులుగా చంటి బిడ్డతో రాత్రి పగలు తేడా లేకుండా అక్కడే టెంటేసి నిరసన తెలుపుతున్నా అధికారులకు కనీసం జాలి, కూడా లేదంటే అధికారులు ఎవరి వైపు ఉన్నారో అర్థమవుతున్న పరిస్థితి నేడు నెలకొం దన్నారు. బినామీయులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై తక్షణమే జిల్లా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

12న మన్యం బంద్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బెలగాం : ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన షెడ్యూల్ ప్రాంతాలలో చిన్న గ్రామాల్లో మొదలు పెద్ద గ్రామాల్లో ఎక్కడికక్కడ మన్యం బందును సంపూర్ణంగా విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జెఎసి ఛైర్మన్ కె. ధర్మారావు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఆదివాసీ యువత, విద్యార్థులు నిరుద్యోగ యువత, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీలలో పనిచేస్తున్న ఆదివాసీ నాయకులు మన ఆదివాసీ "మనుగడ కోసం" ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కృషి చేయాలని కోరుతున్నానని అన్నారు. ఈ అవగాహన లేని స్పీకర్ వెంటనే స్పందించి ఆదివాసీ సమాజానికి క్షమించుమని అడగాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఐటీడీఏ డీడీ అన్నదొర

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం పెట్టాలని ఐటీడీఏ డీడీ అన్నదొర అన్నారు. మంగళవారం ఆయన సీతంపేట మండలంలోని ముత్యాలు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్టోర్ రూమ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటిబాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఎటపాక: గౌరీదేవిపేట పీహెచ్‌సీ నేతృత్వంలో వైద్యాధికారి డాక్టర్ దేవినాగ్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానిక హైస్కూల్ విద్యార్థులతో గౌరీదేవిపేటలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దేవినాగ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలలో క్యాన్సర్ వ్యాధి కారణంగా అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయని ముందస్తుగానే గుర్తించినట్లయితే ఈ మరణాలను నియంత్రించవచ్చని తెలియజేశారు. అలానే క్యాన్సర్‌ని ప్రాథమిక దశలోనే గుర్తించడానికి ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ నవీన్, ఏఎన్ఎంలు పూనేం నాగమణి, కె,కృష్ణవేణి, హెచ్.ఎం. కె.శేఖర్, పి. శ్రీనివాస్ దొర, బి.రవి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి అనుకూలంగా కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర - జీకే వీధి: కేంద్ర బడ్జెట్ అన్ని రంగాల వారికి అనుకూలంగా పెట్టడం జరిగిందని గూడెం కొత్తవీధి మండలం బిజెపి మండల అధ్యక్షులు కాకూరు శేఖర్ అన్నారు. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు వచ్చిందన్నారు. మధ్య తరగతి వారికి మేలు చేసే విధంగా ఉందన్నారు. ఎస్‌టీ, ఎస్‌సి మహిళలకు పెద్ద మొత్తంలో ఈ బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం కేటాయించారన్నారు. అదేవిధంగా అన్ని రంగాల వారికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ రూపొందించబడిందని, గ్రామీణ అభివృద్ధి రూ 266817 కోట్లు, వ్యవసాయం అనుబంధ రంగాలకు 1.71347 కోట్లు, విద్యకు రూ.1.28650 కోట్లు, ఆరోగ్యం రూ.98.311, రక్షణ శాఖకు 4.91.732 కోట్లు, పట్టణాభివృద్ధి 96.777 కోట్లు, అలాగే అన్ని శాఖలకు సమన్యాయం చేస్తూ అన్ని సామాజిక రంగాల వారిని ఆదుకునేలా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

విశాలాంధ్ర - సీతంపేట: ప్రభుత్వ ఐటిఐలో ప్రధానమంత్రి కౌశల్య వికాస్ యోజన వారి సారథ్యంలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ కోర్సులు నిర్వహించనున్నట్టు ఐటిఐ ప్రిన్సిపల్ మూటక గోపాలకృష్ణ తెలిపారు. అందుకు సంబంధించి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. కోర్సులు వివరాలు ఫోర్ వీలర్ సర్వీస్ ఆపరేటర్ టెక్నీషియన్ ఫోర్ వీలర్ మెకానిక్, విద్యా అర్హత 10వ తరగతి పాస్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ (టైలరింగ్) విద్యార్హత 10 పాస్, అర్హత గలవారు తేదీ 15/02/ 2025 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు విద్యార్హుపత్రాలతో పాటు, పాస్ ఫోటోలు, ఆధార్ జిరాక్స్ బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ జత చెయ్యాలని తెలిపారు. పూర్తి వివరాలు నిమిత్తం ఈ క్రింది ఫోన్ నెంబర్. 7993795796 సంప్రదించాలని డిఎస్డిఓ సాయి కృష్ణ చైతన్య తెలిపారు.

అడ్వకేట్ ఊకె రవికి రక్షణ కల్పించాలి

దండకారణ్య విమోచన సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది ఊకె రవిపై దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తూ దాడికి ప్రయత్నించడంతో పాటు, ఆయన వాదిస్తున్న కేసులనూ, తన క్లైంట్స్ ద్వారా కేసు వెనక్కి తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని డ్రామాలాడుతూ, అశాంతియుత, ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న గిరిజనేతరులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దండకారణ్య విమోచన సమితి, కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై అక్కడ సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందున పోలీసు వారు జాప్యం చేయకుండా వెంటనే స్పందించి, ఎలాంటి పక్షపాతం లేకుండా, ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా, కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనేతరులు ఏజన్సీ ప్రాంతాల్లోకి అక్రమంగా చొరబడి ఆదివాసుల భూములను అన్యాయంగా లాక్కోడమే కాకుండా, తిరిగి ఆదివాసులపైనే తిరగబడడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఆదివాసీ ప్రాంతంలో గిరిజనేతరుల వలసల ప్రభావంతో ఆదివాసులపై వివిధ రూపల్లో జరుగుతున్న దాడులన్నింటిని తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం అన్నారు. అడ్వకేట్ రవికి ప్రాణ హాని ఉన్నందున ప్రభుత్వం వెంటనే తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ డిమాండ్

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని ఉమ్మడి వరం గ్రామంలో కొండ రెడ్డి గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని నాసిరకంగా ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని మండల ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు తీవ్రంగా మండి పడ్డారు. మంగళవారం ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు ఉమ్మడివరంలోని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కేంద్ర గవర్నమెంట్ కొండ రెడ్డిలకు నివాస స్లాబ్ బిల్డింగ్స్ నిర్మించాలని ప్రభుత్వం నిధులు రెండు లక్షల డెబ్బై ఐదువేల నిధులు మంజూరు చేసిందని, ఇక్కడ గుత్తేదారుడైన కాంట్రాక్టర్ 13 ఇల్లు మంజూరైతే వాటిలో పది ఇల్లు కాంట్రాక్ట్ వర్క్ చేయడం జరిగిందన్నారు. ఇందులో ఎటువంటి నాణ్యత లేకుండా మట్టితో కలిసిన ఇసుకను, కాంక్రీట్ లేకుండా నిర్మాణం చేయడంతో ఇంటి నిర్మాణాలు పగుళ్లు తేలాయని వారు ఆరోపించారు. అందేలా లక్ష్మి భర్త/ చంద్రయ్య రెడ్డి అనే వారి స్లాబ్ బిల్డింగ్ సెంట్రింగ్ కర్రలు ఉండగానే స్లాబు పగులు చెందడం జరిగిందని ఇటువంటి కట్టడాల వల్ల ఆదివాసి కొండరెడ్ల దినదిన గండంతో నిద్ర లేకుండా గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మండల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు, ప్రచార కమిటీ సభ్యులు పొడియం రాజు, పాయం సుబ్బారావు, సోంది నాగేశ్వరావు, సోడి వెంకటరమణమూర్తి, పాయం భాస్కర్, చిన్నపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు వితరణ

విశాలాంధ్ర - ఎటపాక: యటపాక మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన ఉయిక ఇరమయ్య, తెల్లం రాములమ్మలకు చెందిన ఇల్లు అగ్నిప్రమాదానికి గురై కాలిపోవటంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇదే తరహాలో గన్నవరం గ్రామానికి చెందిన కారం రవి ఇల్లు కూడా అగ్నిప్రమాదానికి గురై కాలిపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు జేకే సిటి ఛైర్మెన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆయన వెంటనే స్పందించి మంగళవారం బాధిత కుటుంబాల వద్దకు నేరుగా వెళ్లి ఒక్కో ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు ఇనుప పైపులు అందజేశారు. ప్రకృతి విపత్తులు వరదలు అగ్ని ప్రమాదాలు జరిగి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్న నేపథ్యంలో తనకు తోచింది బాధిత కుటుంబాలకు అందిస్తున్నానని ఎవ్వరు కూడా తీర్చలేని నష్టం వాటిల్లందని కాలి బుడిదైపోయిన ఇంటి నిర్మాణం సామాగ్రి తో పాటు నిత్యవసర వంట సామాగ్రి బట్టలు మంచాలు వంటివి కాలిపోవడంతో వారి బాధ వర్ణనాతీతమన్నారు. గ్రామంలో పురుషులు అందరూ మంచి అలవాటులతో కుటుంబాలను పోషించుకోవాలని మద్యం జోలికు పోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు, ఎన్ సూర్యనారాయణ చౌదరి, మాజీ ఎంపీటీసీ, కణితి మధు,శివ కనకరాజు సర్పంచ్ గౌరీ దేవి పేట, తెల్లం జంపన్న, కొమరం నాగేశ్వరరావు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవకోటి మునగడలో సూర్యుని పాత్ర ఎనలేనిది

ఎమ్మెల్యే విజయచంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జీవకోటి మను గడలో సూర్యుని పాత్ర ఎనలేనిదని స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం రథసప్తమి పుణ్యదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం పార్వతీపురం శివారులోని సూర్యాపీఠంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సూర్యాపీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి, వేద పండితులు శాస్త్రవేత్తంగా పూజా, స్వామివారి కళ్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య భగవానున్ని దర్శించుకోవడం అదృష్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాడి వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో ఏడు పంచాయతీల పరిధిలో గల 25 గ్రామాలు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే పాడి వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాడేరు మాజీ ఎమ్మెల్యే ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరికి కొండ గోకిరి దత్తపుత్రుడు మఠం మురళీకృష్ణ వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో మురళీకృష్ణ మాట్లాడుతూ కొండగోకిరి పంచాయతీ కొత్త పాడి పాత పాడి గ్రామాలకు వెళ్లే రహదారిలో కొండ కాలువపై ఉన్న వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసం అయ్యిందని తెలిపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సానుకూలంగా స్పందించి త్వరలోనే వంతెన నిర్మాణానికి నిధులు కేటాయింపు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోకిరి యువ సైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ఫేర్ వెల్ డే

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగంపేట గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో మంగళవారం ఫేర్ వెల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. త్వరలో జరగనున్న పదవ తరగతి ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివి గురుకులానికి మంచిపేరు తేవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జే వి ఎస్ మధు, సీనియర్ లెక్చరర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజారావు, ఎంపిడిఓ పాండ్రంకి త్రివిక్రమరావు, మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు, వెంకటరమణ, అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చింతపల్లి: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ ద్వారా నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి, ఏ జోగారావు లు అన్నారు. మండలంలోని గొందిపాకల గ్రామంలో ఇన్చార్జి మండల వ్యవ సాయ అధికారి మధుసూదన్‌రావుతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా నీటి వసతి కలిగి వరి నాటుతున్న రైతులకు ఎరువులు, నీటి యాజమాన్యం పై తగు సూచనలు చేశారు. చాలామంది రైతులు తక్కువ రసాయన ఎరువులను వాడి పంటలను సాగు చేస్తున్నందువలన రాబోయే ఖరీఫ్ సీజన్లో రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులను ఎక్కువగా రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వ్యవసాయ అధికారి మధుసూదన రావు తెలిపారు. గ్రామస్తులు సహకారంతో పంట వ్యర్థలను వర్మీ కంపోస్ట్ గా మారుస్తున్న గ్రామ వ్యవసాయ సహాయ అధికారి శోభన్ కృషిని ఈ సందర్భంగా వారు అభినందించారు. యువ రైతులు సెగ్గే సింహాచలం, అమృత తమ సొంత నిధులతో కాఫీ పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ను నెలకొల్పి ఇతర రైతుల పంటలను కూడా ప్రాసెసింగ్ చేయడం ద్వారా అధిక మార్కెటింగ్ ధర లభించే దానికి చేస్తున్న కృషిని శాస్త్రవేత్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు కుశలవుడు , గొందిపాకల గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

11 నుండి మారాయిగూడెం సమ్మక్క జాతర

విశాలాంధ్ర - ఎటపాక: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన దుమ్ముగూడెం మండలలోని మారాయిగూడెంలో ఆదివాసి బిడ్డల సమ్మక్క సారక్క మినీ జాతర ఈనెల 11 నుండి 15 వరకు జరగనుంది. జాతర కార్యక్రమాలు ఈనెల 11 మంగళవారం నుండి జరుగుతుంది. 12వ తేది బుధవారం ఒక్క పొద్దు రాత్రి 10 గంటలకు దేవత నిశానులు, సారలమ్మ గుడికి వచ్చును. 13వ తేదీ గురువారం నిండు జాతర, మ 12 గంటలకు వనదేవత గుడికి వచ్చును. సా 4 గంలకు తల్లి దేవత గుట్ట నుండి గుడికి వచ్చునని ఆలయ నిర్వాహకులు దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మ తెలిపారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను ఈ జాతర రూపంలో కాపాడుకోవడం అందరి బాధ్యత తెలియజేశారు. ఈ జాతర మహోత్స వానికి ఆంధ్ర తెలంగాణ చతిష్గాడ్ మూడు రాష్ట్రాల సరిహద్దు ఎంతో వైభవంగా జరుగుతుందని తెలిపారు.

గిరిజనులు క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - సీలేరు: గిరిజనులు క్యాన్సర్ పై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే.హిమబిందు అన్నారు. మంగళవారం ఆశాడే పురస్కరించుకొని ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు, ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా నోరు,గొంతు క్యాన్సర్ పై ప్రతి ఒక్కరు చైతన్యవంతులు కావాలన్నారు. పొగాకు నమలడం, పొగ తాగడం వల్ల నోరు గొంతు క్యాన్సర్ వ్యాప్తి చెందుతుంది అన్నారు. అలాగే మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు కనిపిస్తున్నాయి అన్నారు. మహిళలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించవచ్చును అన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారణ సులభం అన్నారు. క్యాన్సర్ స్థాయి దాటితే నివారణ కష్టమని, ప్రజలు నోరు గొంతు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ లపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో పారా మెడికల్ సిబ్బంది ఆశా కార్యకర్తలు ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యాధికారితో ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స పొందాలన్నారు. క్యాన్సర్ ని నిర్లక్ష్యం చేయరాదు అన్నారు. అలాగే ప్రస్తుత సీజన్లో గ్రామాల్లో కలిగే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి మెరుగైన చికిత్స పొందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఉద్యోగులు ఆశా కార్యకర్తలు పాల్గన్నారు. అదే విధంగా సీలేరులెఓ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్‌వలి, సబ్ యూనిట్ ఆఫీసర్ కన్నబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు త్రినాధరావు పాల్గొన్నారు.

సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - చింతపల్లి :- త్రాగునీటి సమస్యతో సతమతమవుతున్న చింతలూరు గ్రామస్తుల త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ సొంత నిధులతో పైపులు కొని గ్రామంలోని 120 కుటుంబాలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను పరిష్కరించడం అభినందనీయమని గ్రామస్తులు కొర్ర బాబురావు, జీ మహేష్, కే ఆనంద్, వంతల తులసి, జీ రాజేశ్వరి లు అన్నారు. పెదబరడ పంచాయతీ లోని చింతలూరు గ్రామంలో గడచిన నాలుగు మాసాలుగా త్రాగునీరు ఎద్దడి తో అల్లాడుతున్న చింతలూరు గ్రామస్తులమైన 120 కుటుంబాల వాళ్ళం తాము ఎదుర్కొంటున్న త్రాగునీటి ఇబ్బందులను తమ పంచాయతీ (పెద బరడ) మాజీ సర్పంచ్ సత్యనారాయణ తో విన్నవించు కున్న వెంటనే తన సొంత నిధులతో పైపులు కొని మా గ్రామానికి త్రాగు నీరు కల్పన కు కృషి చేసిన మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణకు గ్రామస్తులందరు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యాలు చేరుకునేందుకు సిబ్బంది శ్రద్ధ పెట్టాలి

విశాలాంధ్ర - సీతానగరం: లక్ష్యాలు చేరుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తగు శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఓ పొంద్రంకి త్రివిక్రమరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ అధ్యక్షతన సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు హౌసింగ్ లబ్దిదారుల వివరాలను తెలియజేశారు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ చేయించుటకు పథకం వివరములను సీతానగరం విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ పాపారావు వివరించారు. గ్రామంలో 350 యూనిట్ దాటిన జాబితాను కార్యదర్శులకు ఇస్తూ లక్ష్యాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలనీ ఆదేశించారు. హౌస్ హెూల్డ్ సర్వే డేటాలోని మిస్సింగ్ అయిన వారి డేటాను త్వరిత గతిని పూర్తి చేయాలని ఎంపిడిఓ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు గూర్చి సమీక్షించారు. ఉపాధి హామీ పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకుని పి ఆర్ వన్ యాప్ ద్వారా అప్లోడ్ చేయాలనీ, ఈనెల 15 నాటికీ ఇంటిపన్నులు వసూలు పూర్తి కావాలని మండల పంచాయతీ విస్తరణ అధికారి కుమార వర్మ తెలిపారు. ఈనెల మూడో శనివారం జరుగు స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులను వివరిస్తూ గ్రామములోని చెత్త సంపద కేంద్రాలను పూర్తిగా స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ జానకిరాం, ఉపాధి హామీ పథకం ఏపిఓ భాను పాల్గొన్నారు.

ప్రతిమహిళ అక్షరాస్యులు కావాలి

విశాలాంధ్ర - సీతానగరం: ప్రతి మహిళ అక్షరాస్యులు కావాలని, వయోజనులైన మహిళలు అక్షరాస్యులు అయితే ఆ కుటుంబం ఎంతో బాగుపడుతుందని వెలుగు ఏపిఎం శ్రీరాములు నాయుడు తెలిపారు. ఆయన కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమం గూర్చి వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 143 వాలంటీర్ టీచర్లను ఏర్పాటు చేయడంతో పాటు 1430 అబ్యాసకులును మొదటి విడత గుర్తించామన్నారు.ఒక్కో వాలంటీర్ టీచర్ 10 మందికి చదువు చెప్పడం జరుగుతుందన్నారు. వెలుగు పథకం ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి అందరిని అక్షరాసులుగా చర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర ,సీతానగరం: ఆశాకార్యకర్తలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, గ్రామాల్లో గర్భిణీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ,ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా నిర్వర్తాలని వైద్యాధికారి పావని తెలిపారు. మంగళవారంనాడు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దు:

అధికారులను ఆదేశించిన ఐటిడిఏ పిఓ అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర, పార్వతీపురం/సీతానగరం : పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో చేపట్టే సిసి,బిటి రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దని ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మండలం హెచ్.కారాడవలస గ్రామంలో సిసి రోడ్,. సీతానగరం మండలం నిడగల్లునుంచి జగన్నాథపురం వరకు వేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలో నిర్మించే రహదారి పనుల నాణ్యత ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీపడరాదని, పక్కాగా నిర్మించాలని సూచించారు. ఇచ్చిన లక్ష్యాలను అధికారులు సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ ఏఈ చంద్రమౌళి, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - గంగవరం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు మంగళవారం మండలంలోని నేల ధోనేలపాడు లో గల ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేట్ల విజయ ఆధ్వర్యంలో నిర్వాసితులు కాలనీలోని పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. నిర్వాసితుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సబ్ కలెక్టర్ వెంట తాహసిల్దార్ శ్రీనివాసరావు ,రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, వీఆర్వో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - సీతానగరం: విద్యార్థులు క్రమశిక్షణతోచదువుకొని ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఫలితాలు సాధించడంతో పాటు జేఈఈ, ఎన్ఐటి వంటి పరీక్షలలో మంచిర్యాంకులు సాధించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అశుతోష్ శ్రీవాత్సవ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మండలంలోని జోగంపేట ప్రతిభ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల తరగతులు విద్యార్థులతో మాట్లాడుతూ ఫలితాల సాధనకు నిరంతరము కృషి చేయాలి అన్నారు. అధ్యాపకులు కూడా ప్రణాళిక బద్ధంగా వారిని ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మరాజు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

విశాలాంధ్ర - సీతానగరం: రెవిన్యూ సమస్యల పరిష్కారంపై అధికారి యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల కాలంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, గ్రామ సర్వేయర్లు నిర్వహించిన గ్రామసభలలో వచ్చిన వినతులపై ఆరా తీశారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో తహసిల్దార్ ప్రసన్నకుమార్, డిప్యూటీ తహసిల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు, సర్వేయర్లుపాల్గొన్నారు

ఏబిసిడిల వర్గీకరణపై జెడ్పీటీసీ హర్షం

విశాలాంధ్ర, బలిజిపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏబిసిడిల వర్గీకరణపై మండల జడ్పిటిసి అలజంగి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దళిత మంత్రులకు, దళిత ఎమ్మెల్యేలకు, దీనికోసం కృషి చేసిన దళిత నాయకులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్ట్ మార్గదర్శకాలు ప్రకారం తెలంగాణలో ఎస్సీల రిజర్వేషన్ల ప్రక్రియ ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేయడం ఆనందాయకమన్నారు. ఆంధ్రాలో కూడా ఇదే తరహాలో అమలు చేయాలని ఆయన కోరారు.